


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం సెప్టెంబర్ 12 2025 | సంపుటి :0 | సంచిక :326 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



హయత్‌నగర్ వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

## హైదరాబాద్ శివారులో కుండపోత వర్షం..

హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా.. నిమిషాల వ్యవధిలోనే రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్‌సిటీ పరిసర ప్రాంతాల్లో గంటన్నరపాటు కుండపోత వర్షం కురిసింది.

**విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్**

భారీ వర్షానికి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారిపై మోకాలి లోతు నీరు ప్రవహిస్తోంది. నగర శివారులోని హయత్‌నగర్ నుంచి సిటీవైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

పేజి 2లో ▶




## శంషాబాద్–చెన్నై బుల్లెట్ ట్రైన్..

## ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్..!

= తెలంగాణకు రీజినల్ రింగ్ రైల్ ముఖ్యం

= గ్రీన్ ఫీల్డ్ హైవేకు అనుసంధానంగా ఫ్యూచర్ సిటీ నుంచి రైల్వే లైన్

= భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రెడీ చేయాలె

= పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: శంషాబాద్ నుంచి చెన్నయ్ వరకు బుల్లెట్ ట్రైన్ కొత్త రైల్వే కనెక్టివిటీ అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రైల్వే లైన్ తో పోలిస్తే కొత్త లైన్‌తో దూరం కూడా తగ్గుతుందని చెప్పారు. ఇవాళ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన ప్రాజెక్టులపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేకు అనుసంధానం చేస్తూ రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని అన్నారు.

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. వికారాబాద్–కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పేజి 2లో ▶

## గొర్రెల పంపిణీ కుంభకోణంలో బాధితులకు ఈడీ నోటీసులు



2లో

## పాఠశాలలో పదోతరగతి విద్యార్థి అనుమానాస్పద మృతి



2లో

## సెప్టెంబర్ 17న తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవం నిర్వహించాలి: కూనంనేని

2లో

## గ్రూప్-1 పరీక్షలు..

### విద్యార్థుల ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాలి: కేటీఆర్



హైదరాబాద్: గ్రూప్-1 పోస్టుల కోసం భారీగా డబ్బులు చేతులు మారాయని పలువురు విద్యార్థులు చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, దీనిపై తగిన విచారణ జరగాల్సిన అవసరం ఉందని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. గ్రూప్-1 పోస్టులను కాంగ్రెస్ మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయం అమ్ముకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఈ మేరకు పలువురు విద్యార్థులు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడి, తమ విలువైన సమయాన్ని వెచ్చించి పోటీ పరీక్షలు రాసిన తెలంగాణ యువత నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని మండిపడ్డారు. గ్రూప్-1 పరీక్షను మళ్లీ తాజాగా, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఓ న్యాయ కమిటీని వేసి, ఉద్యోగాలు అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## హైదరాబాద్, విశాఖలోని జగన్ సన్నిహితుడి కంపెనీల్లో సిట్ సోదాలు



ఏపీ మద్యం కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు చేస్తోంది. వైకాపా అధ్యక్షుడు జగన్ సన్నిహితుడైన నర్రెడ్డి సునీల్‌రెడ్డి కంపెనీల్లో సిట్ సోదాలు చేస్తోంది. హైదరాబాద్, విశాఖలోని 10 కంపెనీల్లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3 స్నేహహౌస్‌లో, రోడ్ నంబర్ 2 సాగర్ సొసైటీలో, కాటేదాన్-రాజేంద్రనగర్, ఖైరతాబాద్-కమలాపురి కాలనీ ఫేజ్-1లోని కార్యాలయాల్లో, వాల్తేర్ రోడ్-వెస్ట్‌వింగ్-విశాఖలో ఉన్న కార్యాలయంలో అధికారులు సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్, విశాఖలో ఏకకాలంలో సిట్ బృందాలు దర్యాప్తు చేపట్టాయి. హైదరాబాద్‌లోని 8 కంపెనీలకు సునీల్‌రెడ్డి 4 కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. విశాఖలోని రెండు కంపెనీలకు ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు.

## కాళేశ్వరంపై సీబీఐ కేసుకు..

## బీజేపీ కొత్త మెలిక




- కాళేశ్వరంపై సీబీఐ కేసుకు.. బీజేపీ కొత్త మెలిక
- ఓవరాల్ కాళేశ్వరం అప్పగించాలన్న స్టేట్ చీఫ్
- బీజేపీని బద్నాం చేసేందుకే కేసు సీబీఐకి అప్పగించారన్న పాయల్ శంకర్
- నిన్నటి వరకు సీబీఐకి ఇవ్వాలన్న కమలనాథులు
- ఇప్పుడు మాటమార్చుతున్న కాషాయ పార్టీ నేతలు
- మూడు బ్యారేజీలపైనే కాళేశ్వరం కమిషన్ ఏర్పాటు
- డ్యామేజీ అయిన వాటిపైనే విచారణ జరిపిన ఘోష్ ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టుల ఆధారంగా విచారణ పూర్తి
- ఇంతకూ సీబీఐ విచారిస్తుందా? లేదా? అనే అనుమానాలు

2లో ▶

# సంపాదకీయం

## మోహన్ భగవత్ కరుణార్ద్ర నేత

ఈ రోజు సెప్టెంబరు 11... 'వసుధైవ కుటుంబకం' సూత్రంతో ప్రేరణ పొంది, సామాజిక మార్పు%-%సామరస్యం, సోదరభావ స్ఫూర్తి బలోపేతం లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహనీయుడి జన్మదినమిది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో అనుబంధంగల లక్షలాది మంది ఆయనను సగౌరవంగా.. ప్రేమాభిమానాలతో పరమ 'పూజ్య సర్‌సంఘ్‌చాలక్' అని పిలుచుకుంటారు. అవును... నేను చెబుతున్నది మోహన్ భగవత్ గురించే! ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఆయన 75వ జన్మదిన వేడుక నిర్వహించుకోవడం యాదృచ్ఛికం. ఈ సందర్భంగా నా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆ దైవం ఆయనకు దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.
మోహన్ భగవత్ కుటుంబంతో నా అనుబంధం ఎంతో లోతైనది. ఆయన తండ్రి దివంగత మధుకర్ రావు భగవత్‌తో సన్నిహితంగా పనిచేసే అదృష్టం నాకు దక్కింది. ఈ అనుభవాన్ని నా రచన 'జ్యోతిపుంజ్'లో విస్తృతంగా వివరించాను. న్యాయ వ్యవస్థతో తన అనుబంధంతో పాటు, దేశ ప్రగతి కోసం ఆయన తనను తాను అంకితం చేసుకున్నారు. గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా 'ఆర్ఎస్ఎస్'ను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. దేశ పురోగమనంపై మధుకర్ రావు తపన ఎంతటిదంటే%-% తన కుమారుడు మోహన్ రావును భారత పునరుజ్జీవనం దిశగా కృషికి పురిగొల్పింది. మధుకర్ రావు ఒక పరుసవేది కాగా, మోహన్ రావు రూపంలో మరో 'మణి'ని తీర్చిదిద్దారు.
మోహన్ 1970 దశకం మధ్య భాగంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అయ్యారు. 'ప్రచారక్' అంటే%-% ఏదో ఒక సిద్ధాంతం ఆధారంగా సంబంధిత ప్రబోధాలను ప్రచారం చేసే బాధ్యతగా కొందరు అపార్థం చేసుకోవచ్చు. కానీ, ఆర్ఎస్ఎస్ పనితీరు గురించి తెలిసిన వారికి 'ప్రచారక్' అనేది సంస్థలో కీలక పని సంప్రదాయమనే వాస్తవం చక్కగా తెలుసు. గడచిన వంద సంవత్సరాలుగా దేశభక్తి ప్రేరణగా వేలాది యువత 'భారతదేశమే ప్రధానం' లక్ష్యంగా దాన్ని సాకారం చేసే దిశగా తమ జీవితాలను అంకితం చేశారు. ఇందుకోసం వారు ఇల్లూవాకిలీ సహా కుటుంబ బంధాలన్నిటినీ వదులుకుని దేశమాత సేవలో తరించారు.
ఆయన 'ఆర్ఎస్ఎస్'లో ప్రవేశించిన తొలినాళ్ల సమయాన్ని భారత చరిత్రలో అంధకార యుగంగా అభివర్ణించవచ్చు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత క్రూర ఎమర్జెన్సీ విధించిన సమయమది. ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవిస్తూ, దేశం ప్రగతి పథంలో పయనించాలని ఆకాంక్షించే ప్రతి వ్యక్తీ దీన్ని ప్రతిఘటిస్తూ ఉద్యమంలో దూకడం అత్యంత సహజం. అదే తరహాలో మోహన్ సహా అసంఖ్యాక 'ఆర్ఎస్ఎస్' స్వయంసేవకులు కూడా ఇలాగే చేశారు. మహారాష్ట్రలోని గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో... ముఖ్యంగా విదర్భలో ఆయన విస్తృతంగా పనిచేశారు. తద్వారా పేదలు, అణగారిన వర్గాల సమస్యలను ఆకళింపు చేసుకునే అవకాశం ఆయనకు లభించింది.
అనంతర కాలంలో భగవత్ 'ఆర్ఎస్ఎస్'లో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయా విధుల నిర్వహణలో ఆయన అసమాన నైపుణ్యం ప్రదర్శించారు. ముఖ్యంగా 1990 దశకంలో 'అఖిల భారతీయ శారీరక్ ప్రముఖ్' అధిపతిగా మోహన్ పనిచేసిన కాలాన్ని చాలామంది స్వయంసేవకులు నేటికీ ఎంతో ప్రేమాభిమానాలతో స్మరించుకుంటుంటారు. ఆ సమయంలో ఆయన బిహార్ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సంఘ్ నిర్మాణం కోసం అవిరళ కృషి చేశారు. జనజీవనంలోని క్షేత్రస్థాయి సమస్యలపై ఆయన అవగాహనను ఈ అనుభవాలు మరింత పెంచాయి. అటుపైన 21వ శతాబ్దారంభంలో ఆయన 'అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్'గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2000లో 'సర్‌కార్యవాహ్' అయ్యారు. ఈ రెండు పదవుల్లోనూ తనదంటూ ప్రత్యేక పనిశైలిని ఆచరణలో పెట్టారు. అత్యంత సంక్లిష్ట పరిస్థితులను సులువుగా, కచ్చితత్వంతో నిభాయించారు. ఆ తర్వాత 2009లో 'సర్‌సంఘ్‌చాలక్'గా ఆర్ఎస్ఎస్ పగ్గాలు చేపట్టిన నాటినుంచీ అందరికీ ఉత్తేజమిచ్చే విధంగా పనిచేస్తున్నారు.
ఈ పదవీ నిర్వహణ సంస్థాగత బాధ్యతను మించిన కర్తవ్యం. సంస్థ ఉద్దేశాలు, నిర్దేశాలపై స్పష్టత, భరతమాతపై అపార ప్రేమగల అసాధారణ వ్యక్తులు త్యాగం, అచంచల నిబద్ధతతో ఈ బాధ్యతలకు కొత్త నిర్వచనమిచ్చారు. మోహన్ భగవత్ ఈ గురుతర బాధ్యతను అనితర సాధ్యంగా నిర్వహించడంతోపాటు స్వీయ శక్తిసామర్థ్యాలు, మేధస్సు జోడించి కరుణార్ద్ర నాయకత్వాన్ని ఆచరణాత్మకంగా చూపారు. 'దేశమే ప్రధానం' అన్న సూత్రమే వీటన్నిటికీ ప్రేరణ!
అవిచ్ఛిన్నత, అన్వయం.. మోహన్ జీ మనఃపూర్వకంగా భావించిన, తన కార్యశైలిలో ఇముడ్చుకున్న ముఖ్యమైన అంశాలపై ఆలోచిస్తే ఈ రెండూ నాకు స్ఫురిస్తాయి. మనం గర్వించే సంస్థాగత భావజాలపరంగా రాజీపడకుండా, అదే సమయంలో మారుతున్న సామాజిక అవసరాలకూ అనుగుణంగా.. సంక్లిష్టమైన అంశాల్లోనూ ఆయన సమర్థంగా సంస్థను ముందుకు నడిపారు. ఆయనకు యువతతో సహజమైన అనుబంధం ఉంది. ఎప్పుడూ పెద్ద సంఖ్యలో యువతను సంఘ్‌పరివార్‌లో భాగస్వాములను చేయడంపై దృష్టి సారించారు. ఆయనెప్పుడూ బహిరంగ చర్చల్లో పాల్గొంటూ, ప్రజలతో సంభాషిస్తూ కనిపిస్తారు. నేటి గతిశీల, డిజిటల్ ప్రపంచంలో ఇది అత్యంత ప్రయోజనకరమైన అంశం.
స్థూలంగా చెప్పాలంటే, వందేళ్ల ఆర్ఎస్ఎస్ ప్రస్థానంలో భగవత్ జీ బాధ్యతలు నిర్వర్తించిన కాలం అత్యంత విప్లవాత్మక సమయమని చెప్పక తప్పదు. యూనిఫాంలో మార్పు నుంచి శిక్షా వర్గలలో (శిక్షణ శిబిరాలు) మార్పుల వరకు.. ఆయన నేతృత్వంలో అనేక ముఖ్యమైన మార్పులు వచ్చాయి.
మానవత్వం విపత్తుతో తలపడిన కోవిడ్ కాలంలో మోహన్ జీ కృషి నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. మన జీవితకాలంలో మునుపెన్నడూ చూడని ఆ విపత్తు వేళ ఆర్ఎస్ఎస్ సాంప్రదాయక కార్యకలాపాల కొనసాగింపు సవాలుగా మారింది. సాంకేతికత వినియోగాన్ని పెంచాలని మోహన్ జీ సూచించారు. ప్రపంచవ్యాప్త సవాళ్ల నేపథ్యంలో.. సంస్థాగత యంత్రాంగాలను అభివృద్ధి చేస్తూనే, అంతర్జాతీయ పరిణామాలనూ నిశితంగా పరిశీలించారు. స్వీయ రక్షణ చర్యలతోపాటు ప్రజా రక్షణను కర్తవ్యంగా భావిస్తూ.. ఆపన్నులను ఆదుకునేందుకు ఆ సమయంలో స్వయంసేవకులంతా శక్తివంచన లేకుండా కృషి చేశారు. అనేకచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించాం. కష్టపడి పనిచేసే మా స్వయంసేవకులను కూడా మేం కోల్పోయాం. కానీ మోహన్ జీ స్ఫూర్తి వల్ల వారి దృఢ సంకల్పం ఎప్పుడూ సడలలేదు.
ఈ ఏడాది మొదట్లో నాగ్‌పూర్‌లో మాధవ్ నేత్ర చికిత్సాలయ ప్రారంభోత్సవం సందర్భంగా.. ఆర్ఎస్ఎస్ ఒక అక్షయవటం (మర్రివృక్షం) లాంటిదని, అది మన దేశ సంస్కృతిని, సామూహిక చైతన్యాన్ని శక్తిమంతం చేస్తుందని నేను వ్యాఖ్యానించాను. ఈ అక్షయవట మూలాలు లోతైనవి, బలమైనవి. ఎందుకంటే అవి విలువలతో కూడుకున్నవి. ఈ విలువలను పెంపొందించడానికి, ముందుకు తీసుకెళ్లడానికి మోహన్ భగవత్ జీ అంకితభావంతో వ్యవహరించిన విధానం నిజంగా స్ఫూర్తిదాయకం.
మోహన్ జీ వ్యక్తిత్వంలో మరో అద్భుత లక్షణం ఆయన మృదుభాషణం. ఆయన అందరి మాటా వింటారు. ఈ లక్షణం విస్తృత దృక్పథానికి నిదర్శనం. ఇదే ఆయన వ్యక్తిత్వానికి, నాయకత్వానికి శోభనిచ్చింది.
వివిధ ప్రజా కార్యక్రమాలపై ఆయన చూపించిన ఆసక్తి గురించి కూడా నేను రాయాలనుకుంటున్నాను.

## శంషాబాద్-చెన్నై బుల్లెట్ ట్రైన్.. ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్..!

మొదటిపేజీ తరువాయి
రాష్ట్రంలో ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.
హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు.
వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వరంగల్‌లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు.
కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు వరంగల్‌ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

### లైన్ల పూర్తికి సంపూర్ణ సహకారం

పెండింగ్ లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.
సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాస్ రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17న తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవం నిర్వహించాలి: కూనంనేని



మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. దానిని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవాన్ని జరపాలని అప్పట్లో కేసీఆర్ అన్నారని, కానీ, అధికారంలోకి రాగానే సమైక్యతా దినోత్సవం పేరుతో నిర్వహించారని గుర్తు చేశారు. 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటం మొదలైందన్నారు. ఆ పోరాటంలో పోరాడిన వారి విగ్రహాలతో మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు.

## కాళేశ్వరంపై సీబీఐ కేసుకు.. బీజేపీ కొత్త మెలిక

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిని విచారించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. దీనిపై ఇప్పటి వరకు సీబీఐ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే ఇదే తరుణంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ సీబీఐకి ఓవరాల్ కాళేశ్వరంపై విచారణను అప్పగించాలని డిమాండ్ చేశారు.
ఇదిలా ఉండగా ఆ పార్టీ శాసన సభా పక్ష ఉప నేత పాయల్ శంకర్ నిన్న మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, బీజేపీని బద్నాం చేసేందుకే కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించారని అన్నారు. కాళేశ్వరం అవినీతిపై విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, స్టేట్ చీఫ్ రాంచందర్ రావు నిన్నటి వరకు మాట్లాడిన సంగతి విదితమే. ఇప్పుడు మాటమార్చడం హాట్ టాపిక్ గా మారింది.
కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపైనే సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ పినాకీ చంద్రఘోష్ నేతృత్వంలోని కమిషన్ విచారణ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం కూడా ప్రమాదకర స్థితికి చేరడంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికను, విజిలెన్స్ రిపోర్టును బేస్ చేసుకోవడంతోపాటు ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ ప్రశ్నించింది.
అప్పటి సీఎం కేసీఆర్, అప్పటి నీటిపారుదల మంత్రి హరీశ్ రావు, అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తోపాటు ఈఎన్సీలను, వివిధ హోదాల్లో పనిచేసిన ఇంజినీర్లను, అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను, డిజైనింగ్ ఇచ్చిన వ్యాప్కోస్ సంస్థ ప్రతినిధులను విచారించింది. 665 పేజీలున్న ఈ రిపోర్టులో మాజీ సీఎం కేసీఆర్ పేరును ఏకంగా 266 సార్లు ప్రస్తావించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.
దీనిపై కేబినెట్ లో, అసెంబ్లీలో చర్చించిన ప్రభుత్వం కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అప్పటి వరకు సీబీఐకి అప్పగించాలని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని విమర్శలు చేసిన కమలనాథులు అయోమయంలో పడిపోయారు. తొలుత సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తూనే.. ఈ పని ఎప్పుడో చేయాల్సిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాజాగా కమలనాథుల స్వరం మారింది. బీజేపీని బద్నాం చేసేందుకే కేసును సీబీఐకి అప్పగించారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అంటే.. స్టేట్ చీఫ్ రాంచందర్ రావు కూడా మాటమార్చి.. ఓవరాల్ కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించాలనే కొత్త పల్లవి ఎత్తుకున్నారు. విచారణ ప్రారంభిస్తే అన్ని విషయాలూ బయటికి వస్తాయని విశ్లేషకులు అంటున్నారు.

# హైదరాబాద్ శివారులో కుండపోత వర్షం..

మొదటిపేజీ తరువాయి



**పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు.**

### గంటల వ్యవధిలో 13సెం.మీ వర్షం

మరోవైపు మెదక్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో మూడున్నరగంటల వ్యవధిలోనే 13 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాజీపల్లిలో 9.2 సెం.మీ, పాతూర్‌లో 8 సెం.మీ మేర వర్షం కురిసింది. మెదక్ పట్టణంలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మెదక్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీని వరద ముంచెత్తింది. వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. మెదక్-హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరడంతో అధికారులు జేసీబీతో డివైడర్‌ను తొలగించారు.

## గొర్రెల పంపిణీ కుంభకోణంలో బాధితులకు ఈడీ నోటీసులు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: గొర్రెల పంపిణీ కుంభకోణంలో దర్యాప్తును ఈడీ అధికారులు వేగవంతం చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని గొర్రెల పంపిణీ కుంభకోణం బాధితులకు నోటీసులు జారీ చేసింది. మొయినుద్దీన్ అండ్ గ్యాంగ్ ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి దాదాపు రూ.2కోట్లు మేర మోసం చేసినట్టు ఈడీ దృష్టికి వచ్చింది. రైతులకు చెల్లించాల్సిన నగదును ప్రభుత్వ అధికారుల సాయంతో బినామీలు, సొంత ఖాతాలకు మొయినుద్దీన్ బదిలీ చేసుకున్నట్టు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది.

## పాఠశాలలో పదోతరగతి విద్యార్థి అనుమానాస్పద మృతి

మొదటిపేజీ తరువాయి
హనుమకొండ: హనుమకొండ నైమ్‌నగర్‌లోని తేజస్వి హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న పోలేపల్లి జయంతి వర్ధన్ (15) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అకస్మాత్తుగా విద్యార్థి ముక్కు, చెవి నుంచి రక్తం రావడంతో గుర్తించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే, విద్యార్థి మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమకొండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## చర్లపల్లి టు అనకాపల్లి.. 8 ప్రత్యేక రైళ్లు.. ఆగే స్టేషన్లు ఇవే!




పండుగ సీజన్ రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా చర్లపల్లి- అనకాపల్లి మధ్య ప్రత్యేక సర్వీసులు నడపాలని నిర్ణయించింది. చర్లపల్లి- అనకాపల్లి- చర్లపల్లి మధ్య మొత్తంగా 8 సర్వీసులు నడపనుంది. ఈ రైళ్లు సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 5వ తేదీ మధ్య ప్రతి శని, ఆదివారాల్లో సర్వీసులు అందించనున్నాయి. చర్లపల్లి- అనకాపల్లి రైలు (07035) సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 4వరకు ప్రతి శనివారంబీ అనకాపల్లి- చర్లపల్లి రైలు (07036) సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ 5వరకు ప్రతి ఆదివారం సర్వీసులు అందించనున్నాయి.

### తిరుమలపై తప్పుడు ప్రచారం.. అలాంటివి నమ్మొద్దు!

ఈ ప్రత్యేక రైళ్లు ఇరువైపులా జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, వీటిలో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్, జనరల్ సెకెండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. అయితే, ఈ రైళ్లు ఏ సమయానికి బయల్దేరుతాయనే వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు.

# 600 గజాల స్థలాన్ని కాపాడిన అసోసియేషన్



## – బోడుప్పల్ అసోసియేషన్ ఘనత

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని క్రాంతి కాలనీలో 600 గజాల విలువైన స్థలంపై అనధికారిక నిర్మాణ ప్రయత్నాలను కాలనీ అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఆ స్థలాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టారు. ఈ సత్వర చర్యపై స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్ తరాల కోసం ఇది ముఖ్యమైన రక్షణ చర్య అని అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ సభ్యులు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాలనీ వాసులు అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నడుచుకుంటూ వెళుతున్న మహిళల నుంచి బంగారు గొలుసులను దొంగిలించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. గుండె పోచంపల్లి కె.వి రెడ్డి నగర్ లో బాలమణి (60) అనే మహిళ వాకింగ్ చేస్తుండగా, ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. బాలమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరో రెండు ఘటనలలో, ఎన్సీఎల్ కాలనీ బస్ స్టాప్ సమీపంలో, పైప్ లైన్ రోడ్డులోని అపార్ట్మెంట్ వద్ద మహిళల మెడలో నుంచి గొలుసులు దొంగిలించే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఒక చైన్ స్నాచర్ మహిళ మెడలో నుంచి గొలుసును దొంగిలించే ప్రయత్నం చేసిన సీసీటీవీ ఫుటేజ్ విస్తృతంగా షేర్ అయింది.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

## – 10 మంది మావోయిస్టులు మృతి




**కరపత్రం హైద్రాబాద్**
ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబాద్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ సహా 10 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

## – జువ్వాడి నర్సింగ రావ్



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు గురువారం ఇబ్రహింపట్నం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయా గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు లక్షా 37.5 వేల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, సహాయనిధి చెక్కులను త్వరగా అందజేస్తుందని ఆయన అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

# ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై అఖిలపక్ష సమావేశం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం గురువారం ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తుల గంగవ్వ ట్రస్ట్ చైర్మన్ తుల రాజేందర్ కుమార్, తెలంగాణ జన సమితి పార్టీ, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జీ కంతి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ, బీఆర్ఎస్, సమాజ్‌వాదీ, బీసీవైసీ పార్టీల ప్రతినిధులు, చెరుకు రైతు సంఘం, రైతు సంఘాల ప్రతినిధులు, చెరుకు రైతులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకులు కాటిపెల్లి కుటుంబానికి పరామర్శ



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మెట్టుపల్లి మాజీ జడ్పీటీసీ కాటిపెల్లి రాధ శ్రీనివాస్ కుమారుడు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందారు. ఈ నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు శిక్షణ

## – డిజిటల్ లైబ్రరీ, అభ్యసన సామర్థ్యాలపై అవగాహన



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
గురువారం కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కోరుట్ల, కథలాపూర్ మండలాల ప్రాథమికోన్నత స్థాయి ఇంగ్లీష్ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిజిటల్ లైబ్రరీల వినియోగం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపు, సబ్జెక్టుల వారీగా సామర్థ్యాలు, ఇంగ్లీష్ చదవడం, రాయడం, వాక్యాల నిర్మాణం, పదజాలం కూర్పు వంటి అంశాలపై రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ధరందిప్, హరనాథ్, సంజీవ్ రెడ్డిలు, ప్రధానోపాధ్యాయులు వి. గంగాధర్, ఉపాధ్యాయులు, సి.ఆర్.పి.లు పి. గంగాధర్, జ్యోతిలు పాల్గొన్నారు.

# మల్లాపూర్ గిరిజన పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని గిరిజన పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల స్థితిగతులు, వారికి కల్పిస్తున్న వసతులు, విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో మెట్పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

## 'శిథిలావస్థలో ఉన్న గదుల వివరాలను సమర్పించాలి'

**సంగారెడ్డి జిల్లా/ కరపత్రం ప్రతినిదిసెప్టెంబర్ 11.**
సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న గదుల వివరాలను సమర్పించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. డీఈఓ మాట్లాడుతూ.. మండల విద్యాధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించి శిథిలావస్థలో ఉన్న గదుల వివరాలను ఈ రోజు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

# గుండెపోటుతో పాత్రికేయు మిత్రుడు మృతి బాధాకరం

**ఆర్మూర్,కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ (11)**



డిచ్ పల్లి మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు లక్కవత్రి నారాయణ గురువారం తెల్లవరుజామున గుండెపోటుతో మరణించడం బాధాకరమని ఆయన లేని లోటు తీర్చలేమని టి యు డబ్ల్యూ జె ఐ జె యు జిల్లా ఉపాధ్యక్షుడు నవనాథ పురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ పార్దేమ్ అన్నారు.ఆర్మూర్ జర్నలిస్ట్ ల తరపున సానుభూతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వమే అన్నివిధాల ఆదుకోవాలని ఆయన ప్రజాపాలన ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు.

# కోహెడ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## – హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు
## – మంత్రి పొన్నం ప్రభాకర్



**కరపత్రం ప్రతినిధి**
**హుస్నాబాద్**
కోహెడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. నారాయణపూర్ గ్రామంలో గొట్లమిట్ట నుండి నారాయణపూర్ వెళ్ళే రోడ్డుపై 91.55 లక్షల రూపాయల వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. చాలా కాలంగా ఈ బ్రిడ్జి కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. పనులు వేగంగా పూర్తి చేసి బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కాచాపూర్ గ్రామంలో 57 లక్షల రూపాయల వ్యయంతో కోహెడ మైసంపల్లి వయా షేర్ అలీ నగర్, సీసీపల్లి, కాచాపూర్ రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, ఆర్డీవో రామ్మూర్తి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి ఎస్సై క్రాంతి పటేల్

**ఝరాసంగం మండలం కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ 11**



సెప్టెంబర్ 13న జహీరాబాద్ లో జరగనున్న లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి రాజీ మార్గమే రాజా మార్గం రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీ పడవచ్చు ఝరాసంగం ఎస్సై క్రాంతి పటేల్ సందర్భంలో మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను సరి చేసుకోవడానికి లోక్ అదాలత్ మంచి అవకాశం అనవసర గొడవలకు పోయి జీవితాలను పాడు చేసుకోవద్దని అన్నారు మండల వ్యాప్తంగా చాలాకాలం పెండింగ్లో ఉన్న కేసులన్నీ లోకల్ అదాలతో నా కేసులన్నీ రాజీ పడడానికి అవకాశం ఉన్న కేసులన్నిటి కూడా లోక్ అదాలత్ పరిష్కరించుకోగలరు రాజి పడదగిన కేసులు క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు సివిల్ తగాదాల కేసులు ఆస్తి విభజన కేసులు కుటుంబ పరమైన కేసులు బ్యాంకు రికవరీ విద్యుత్ చౌర్యం చెక్ బౌన్స్ కేసులు

# జిల్లా వ్యాప్తంగా పౌర హక్కుల దినోత్సవం పకడ్బందీగా జరపాలి జిల్లా కలెక్టర్ కి కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం

**కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్:11**




ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం,దినకర్ మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించకాపోవడం వలన ప్రజలకు రాజ్యాంగంపై పౌర హక్కుల పై అవగాహన లేకుండా పోతుందని దీనివలన గ్రామాలలో ప్రజలకు అవగాహన లోపించి అంటి అంటరానితనం కులవృక్ష అసమానతలు పెరిగిపోతున్నాయని అన్నారు జిల్లాలో నామమాత్రంగా పౌర హక్కుల దినోత్సవం జరిపి చేతులు దులుపుతున్నారని అన్నారు పౌర హక్కుల దినోత్సవం గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జిల్లా అధికారులు గ్రామస్థాయిలో గ్రామ అధికారులు మండల స్థాయిలో తహసీల్దార్ సబ్ ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో జరగాలి కానీ జిల్లాలో అవేమీ అమలు జరపకుండా కిందిస్థాయి అధికారులతో పౌర హక్కుల దినోత్సవం జరిపి మామ అనుకుంటున్నారు కావున పౌర హక్కుల దినోత్సవం పకడ్బందీగా నిర్వహించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ ను కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వడ్లూరి మల్లేష్, నగేష్ ఉన్నారు

# కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

● విద్యార్థులకు ఏ.ఐ. టూల్స్ పై శిక్షణ ఇవ్వాలి
● రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా





**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వేములవాడ**
విద్యార్థులకు ప్రస్తుత ఆధునిక ఏఐ టూల్స్ పై శిక్షణ ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని వంటగది, స్టోర్ రూము, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉంచిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతి రోజు అందిస్తున్న భోజన, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు చుట్టూ అపరిశు భ్రత, రహదారి, విద్యాలయం భవనానికి ప్రహరీ లేనట్లు గమనించారు. విద్యాలయం ఆవరణను శు భ్రంగా చేయాలని వేములవాడ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. రోడ్డు, ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

**ఉపాధ్యాయులు పాఠాలను అవగాహన చేసుకోవాలి**

పాఠశాలలోని 7వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు మ్యాథ్స్, సోషల్, సైన్స్ ఎకనామిక్స్ కంప్యూటర్స్ పాఠాలను కలెక్టర్ బోధించారు. ఇంటర్ విద్యార్థులకు కంప్యూటర్స్ ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. విద్యార్థులను ఉదయం బ్రేక్ ఫాస్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికి వచ్చే ముందు పాఠాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని వచ్చి విద్యార్థులకు సరిగ్గా విద్యాబోధన చేయాలని ఆదేశించారు.

# కాంగ్రెస్ తప్పును ఒప్పుకొని గ్రూప్ 1 పరీక్షను రద్దు చేయాలి

- బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వేములవాడ**
గ్రూప్ 1 పరీక్షల్లో జరిగిన అవినీతి అక్రమాలను తప్పులను ఒప్పుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రూప్ 1 పరీక్షను రద్దు రద్దుచేసి, మెయిన్స్ పరీక్షలు మళ్లీ పెట్టాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల హై కోర్టు గ్రూప్ 1 ఫలితాల్ని రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పు వేల మంది నిరుద్యోగులకు తీరని నష్టం కలిగించిందని,రాత్రనక పగలనక కష్టపడి చదివి, మంచి ఉద్యోగం సాధించాలనే తపన నీరు గారి పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పెద్ద లాయర్లతో సుప్రీంకోర్టుకు వెళ్తే విద్యార్థుల గొంతు కోసినోళ్ళ అవుతారని,గ్రూప్ 1 పోస్టుల్లో జరిగిన అవినీతి అక్రమాల్లో ఎవరున్నారో పూర్తి స్థాయి విచారణ జరిపి బయటపెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో మితిమీరిన వీడిసి ఆగడాల పై చర్య తీసుకోవాలి

-కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్
-ఆర్మూర్ మండలం పిప్రి లో దారుణం
-కల్లు ధర పెంచినందుకు 54గౌడ కుటుంబాలను బహిష్కరించిన వీడీసీజి



**కరపత్రం ప్రతినిధి అందోలు ప్రతినిధి:**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పిప్రీలో మంగళవారం నాడు గౌడ సోదరులు తమ వృత్తి చేసుకునే కల్లు సీసా దర మూడు రూపాయలు పెంచినందుకు 54గౌడ కుటుంబాలను ఎలాంటి చట్టబద్ధత లేని అక్రమంగా ఉన్న గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) వాళ్ళు గ్రామ బహిష్కరణ చేయడాన్ని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ తెలుపుతూ రోజురోజుకూ పెరుగుతున్న అక్రమ మద్యం బెల్టు షాపుల వల్ల కల్లు అమ్మకాలు తగిపోతున్నాయి దీనితో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల వల్ల మా కుటుంబాలకు భారంగా మారాయి అయినా వీడీసీ వాళ్ళుగ్రామంలో కల్లు అమ్మాలంటె కచ్చితంగా డబ్బులు ఇవ్వాలంటారు అందువల్ల ప్రతి సంవత్సరం విలేజ్ అభివృద్ధి కమిటీకి 10లక్షలు చెల్లించడం కష్టమవుతుండడంతో, కల్లుసీసా,దర ప్రస్తుతం 12రుపాయలు ఉండగా 3రూపాయలు అదనంగా పెంచటం జరిగింది అని అన్నారు ఇతర ఎలాంటి వస్తువుల ధరలు పెరిగిన వాటి గురించి మాట్లాడని వీడీసీ లు కేవలం గౌడ కులస్తులను గ్రామ బహిష్కరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిజామాబాద్ జిల్లాలో అక్రమంగా ఎలాంటి చట్టబద్ధత లేని గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ) లపైచర్య తీసుకోవాలని గౌడ సోదరులకు రక్షణ కల్పించి కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడాలని అయన ప్రభుత్వాన్ని కోరారు అలాగె గౌడ కుటుంబాలను బహిష్కరించిన వీడీసీ నాయకులపై వెంటనే కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మోడీ జన్మదిన వేడుకలు

- పట్టణంలో 15 రోజులపాటు మోడీ పుట్టినరోజు ఉత్సవాలు



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వేములవాడ**
సెప్టెంబర్ 17న భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని గురువారం పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో భీమేశ్వర గార్డెన్ లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బిజెపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పట్టణ బిజెపి అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ మోడీ పుట్టినరోజు ఉత్సవాలు 15 రోజులు పాటు రాష్ట్ర పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు పట్టణంలో ఘనంగా నిర్వహించాలని. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎర్రం మహేష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు దిక్సూచిగా పాలన కొనసాగిస్తున్న నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు, రక్తదాన శిబిరాలు, చిత్రలేఖనం,2కే రన్, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకోవాలని అన్నారు. అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బూత్ అధ్యక్షులు, పట్టణ కమిటీ నాయకులు, సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం కుల సంఘాలను పట్టించుకోలేదు

- ప్రజా ప్రభుత్వంలోనే కుల సంఘాలకు నిధులు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వేములవాడ**
గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో కుల సంఘాలను పట్టించుకోలేదని, ప్రజా ప్రభుత్వంలోనే కుల సంఘాలకు నిధులు కేటాయిస్తూ ప్రజలు కోరుకున్న పనులు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. గురువారం వేములవాడ పట్టణంలో 15 వార్డు లాలపల్లి బాలానగర్,తిప్పాపూర్ లో పలు కుల సంఘ భవనాల నిర్మాణనికి స్పెషల్ డేవలెప్మెంట్ ఫండ్స్ నుండి మంజూరు కాబడిన ప్రొసీడింగ్ పత్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు.బాలానగర్ లో నూతన ట్రాన్స్ఫార్మర్స్ ప్రారంభించి,రెడ్డి కమ్యూనిటి హాల్ తో పాటు పలు కమ్యూనిటి హాల్ నిర్మాణనికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతినిత్యం అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా ముందుకు పోతుందని అందులో భాగంగా స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుండి పలు కుల, మహిళా సంఘం భవనాల నిర్మాణానికి నిధులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ఎన్నికల ముందు మాట ఇచ్చినట్లుగా పట్టణంలో 43 కుల సంఘ భవనాలకు 2 కోట్ల 58 లక్షల నిధులు ఇవ్వడం జరిగిందన్నారు.. కుల సంఘాలు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయడం ద్వారా ప్రజలకు అనేక రకాలుగా ఉపయోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# గాయత్రి బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ప్రభుత్వ విప్



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి బ్యాంక్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వంశీకృష్ణ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులు బింగి మహేష్, చంద్రగిరి శ్రీనివాస్, కూరగాయల కొమురయ్య తదితరులున్నారు.

# జాడి బాల్రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం.



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 11**
కరీంనగర్ 18 వ డివిజన్ రేకుర్తిలో బిజెపి పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల రెడ్డి ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవ పక్వాడ్ సేవపక్షం ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించే కార్యాశాలను నిర్వహించారు. జాడి బాలారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17వ జన్మదిన రోజున వెస్ట్ జోన్ నుండి సుమారు 75 యూనిట్ల బ్లడ్ డొనేషన్ చేయాలని అన్నారు. తెలంగాణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని అన్నారు. సెప్టెంబర్ 18 రోజున మహిళా మోర్చా ఆధ్వర్యంలో చిత్రలేఖనం నిర్వహిస్తారని అలాగే స్వచ్ఛభారత్ నిర్వహించాలని సెప్టెంబర్ 25 రోజున దీన్ దయ ఉపాధ్యాయ జయంతిని అలాగే ప్రతి బూతులు మొక్కలు నాటాలని అన్నారు . సెప్టెంబర్ 27న దివ్యాంగులను ఘనంగా సన్మానించాలని ,అక్టోబర్ 2న గాంధీ జయంతి, లాల్ బహుదూర్ శాస్త్రి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించి సేవ పక్షం ముగుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్యదర్శి ఎన్. ఎం ప్రకాష్ రాగి సత్యనారాయణ, సేవా పక్వాడ్ కన్వీనర్లు వంగల రవి, గోపాల్ ,తిరుపతి రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జానపట్ల స్వామి, శక్తి కేంద్రం ఇన్చార్జిలు సిద్ధి సంపత్ సుధాకర్ పటేల్, వాసు, పర్వతం మల్లేశం , ఉద్యోగులు లాల మురళి ,గంట నరసింహారెడ్డి కేశవరెడ్డి, భూపతి రెడ్డి,ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి గోదరి నరేష్, కిషన్ మోర్చా మండల అధ్యక్షులు ముదిమడుగుల లక్ష్మీరాజ్యం, ఎస్టి మోర్చ రవి నాయక్, బూత్ అధ్యక్షులు అన్నాజీ వినీత్, బండ రాకేష్, పింగిడి ప్రతాప్ రెడ్డి, రమేష్, వేణు,విష్ణు ప్రసాద్ రావు, నరసింహారెడ్డి, లక్ష్మణ్, రమేష్, రాహుల్, దేవుజ్ రవి తదితరులు పాల్గొన్నారు

# నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ ను సన్మానించిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం .



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 11**
ఆదివారం కరీంనగర్ లో ఓ మహిళ ఆటోలో మరచిపోయిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ ను తిరిగి ఇచ్చి నిజాయితీ చాటుకున్న తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కనకం రాజేందర్ (40) ను కరీంనగర్ పోలీస్ కమీషనర్ కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అభినందించి, సన్మానించారు.
వేములవాడ నుండి కరీంనగర్ కు వచ్చిన ఒక మహిళ గీతాభవన్ వద్ద ఆటో దిగి ఆసుపత్రికి బయలుదేరిన క్రమంలో తన బ్యాగ్ ను ఆటోలో మరిచిపోయింది. బ్యాగ్ ను గమనించిన ఆటో డ్రైవర్ రాజేందర్ వెంటనే ఆమెను దింపిన స్థలానికి తిరిగి వెళ్లి బ్యాగ్ ను అప్పగించారు. బ్యాగ్ లో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు ఉన్నట్లు సదరు మహిళ తెలిపారు. తన కుటుంబంలో ఒకరు అనారోగ్యంతో ఉన్నందున, ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టడానికి తీసుకెళ్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఆటో డ్రైవర్ రాజేందర్ నిజాయితీని గుర్తించిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం గురువారం కమీషనర్ కార్యాలయానికి పిలిపించి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మద్దెల రాజేందర్, పడాల రాజమౌళి తో పాటు పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న జి పిఓ లు

**కరపత్రం ప్రతినిధి జనగాం జిల్లా**
స్టేషన్ ఘనపూర్ లోని GPO లు గా నియామకాలు పొంది బదిలీ పై వెళ్తున్న కార్యాలయ సిబ్బంది నసీరుద్దీన్,నర్సింహ, వంశి క్రిష్ణ, శ్రీనివాస్. జి.దాసు వినోద కు ఈరోజు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం స్టేషన్ ఘనపూర్ నందు రెవెన్యూ డివిజనల్ అధికారి డి.యస్ .వెంకన్న చేతుల మీదుగా మెమొంటోలు ఇచ్చి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా RDO వెంకన్న మాట్లాడుతూ నూతన భాద్యతలు చేపట్టిన మీరు గ్రామాల్లో రెవెన్యూ సేవలను విస్తృత పరిచి గ్రామ ప్రజలకు మంచి సేవలు అందించి రెవెన్యూ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడి మంచి పేరు ప్రఖ్యాతులు పొందాలని ఈసందర్భంగా వారు కోరారు.ఇట్టి కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది.డివిజనల్ పరిపాలన అధికారి డి.శంకరయ్య ,డిప్యూటి స్టాటిస్టికల్ అధికారి.శ్రీనివాస రెడ్డి,నాయబ్ తహశీల్దార్లు వేణు కుమార్, సునంద. సీనియర్ సహాయకులు డి.ఉపేందర్, శ్రీనివాస్, సుష్మ, మరియు జూనియర్ సహాయకులు వినోద. వినయ్,స్రుజన్ కుమార్,బంగారి, శ్రీనివాస్, సునీల్, సంతోష్,టైపిస్టు ఎల్లయ్య, రికార్డు అసిస్టెంట్ వి.వెకటేశ్వర్లు సువార్త , మరియు కార్యాలయ సబార్డినేటర్లు సారయ్య, అశోక్, అభిరామ్ స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు.